క్లుప్తంగా

మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల తనిఖీ



కామారెడ్డి అర్బన్: స్థానిక మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలను శుక్రవారం ఎంఈవో ఎల్లయ్య తనిఖీ చేశారు. కళాశాల భోజనశాల, మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రతలు పాటించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయడానికి మున్సిపల్ అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ ఇంతియాజ్ అలీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో ..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను ఎంపీడీవో ప్రకాష్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజు, ప్రిన్సిపల్ తదితరులున్నారు.

పెద్దకొడప్‌గల్ ఎస్సైగా అరుణ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పెద్దకొడప్‌గల్ నూతన ఎస్సైగా అరుణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ఆపద సమయంలో డయల్ 100 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందాలని తెలియజేశారు.

సదాశివనగర్ ఎస్సైగా పుష్పరాజ్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ ఎస్సైగా పుష్ప రాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సదాశివనగర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రంజిత్ కుమార్ రాజంపేట మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పుష్ప రాజ్ సదాశివ్ నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

పాఠశాలలకు బెంచీల వితరణ



కామారెడ్డి టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం బెంచీలను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో ఎస్.రాజు హాజరయ్యారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అడ్లూర్ పాఠశాలకు 20, లింగాయపల్లి పాఠశాలకు 22, సరంపల్లి పాఠశాలకు 20, తలమడ్ల పాఠశాలకు 35 డెస్క్ బెంచీలను పంపిణీ చేసిన సభ్యులకు డీఈవో కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి, అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సబ్బని కృష్ణహరి, కోశాధికారి వెంకటరమణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి బీసీ అభివృద్ధి అధికారిగా సయ్యద్ రఫీక్

కామారెడ్డి క్రైం: జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా అదే శాఖలో ఏవోగా పనిచేస్తున్న సయ్యద్ రఫీక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ బీసీడీవోగా పనిచేసిన స్రవంతి ఆదిలాబాద్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో రఫీక్‌కు బాధ్యతలు అప్పగించారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడి నియామకం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా గాదె తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం నాయకులు శుక్రవారం తెలిపారు. ఎల్లారెడ్డిలో శుక్రవారం నిర్వహించిన మున్నూరుకాపు సంఘం సమావేశంలో గాదె తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. సంఘం నాయకులు రవీందర్, వెంకటేశం, సత్తయ్య, గురుప్రతాప్, సాయిబాబా, సాయిలు, నక్కగంగాధర్, సురేందర్ తదితరులున్నారు.

దేవునిపల్లి హైస్కూల్లో వంద మందికి అడ్మిషన్లు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా వంద మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఈవో రాజు హాజరై వందవ విద్యార్థి అడ్మిషన్‌ను నమోదు చేశారు. నాణ్యమైన విద్యను అందిస్తున్నందునే కొత్తగా విద్యార్థులు చేరినట్లు హెచ్ఎం గంగాకిషన్ పేర్కొన్నారు. దేవునిపల్లి మాజీ సర్పంచ్ వెంకట్‌రావు, మాజీ కౌన్సిలర్ కృష్ణాజీరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

త్వరలో మెప్మా కనుమరుగు

- మెప్మా, ఐకేపీ విలీనం కానున్నట్లు అధికారుల వెల్లడి
- రెండింటినీ కలిపి ఇందిరా మహిళా శక్తి మిషన్ పేరిట మరో సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం



ఎల్లారెడ్డి పట్టణంలోని ఐకేపీ కార్యాలయం

ఎల్లారెడ్డి : మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, వాటి బలోపేతం కోసం ఏర్పాటు చేసిన మెప్మా కొద్ది రోజుల్లో కనుమరుగు కానున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం సెర్ప్ ఆధ్వర్యంలో మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపాలిటీ ఏరియాస్(మెప్మా)ను 2007 సెప్టెంబర్ 1న ప్రారంభించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని మహిళలతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి వారికి పొదుపుతో పాటు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఈ పథకం ప్రారంభించారు. అధికారుల పర్యవేక్షణా లోపం, సీవోలు, ఆర్పీల పనితీరు తదితర కారణాల వల్ల కాలక్రమేణా మెప్మా కార్య కలాపాలు సన్నగిల్లుతూ వచ్చాయి. పల్లె ప్రాంతాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏటా కొత్త సంఘాల ఏర్పాటు, రుణ లక్ష్యాలు, పొదుపు పథకాలు చక్కగా కొనసాగుతుండగా పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెప్మాను, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐకేపీని విలీనం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ రెండింటినీ వాటి మాతృ సంస్థ అయిన సెర్ప్‌కు కిందకు తెచ్చి ఇందిరా మహిళా శక్తి మిషన్ పేరిట సమూల మార్పులతో కొత్త పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాల్లో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు పూర్తిగా కనుమరుగైంది.

పనితీరుపై ఆరోపణలు

మెప్మా కార్యకలాపాలను పర్యవేక్షించే సీవోలు, ఆర్పీల పనితీరుపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆరోపణలు చోటు చేసుకున్నాయి. వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఈ వ్యవహారం పోలీస్ స్టేషన్ల వరకు కూడా వెళ్లింది.

రుణాలు తీసుకున్న సభ్యులు తిరిగి చెల్లించకపోవడం, రికవరీ శాతం తగ్గిపోవడంతో మెప్మా ఉనికి ప్రశ్నార్థకమైంది. వీటికి తోడు చాలా చోట్ల మెప్మాలకు పీడీలు లేకపోవడంతో పర్యవేక్షణా లోపం కొట్టొచ్చినట్లు కనిపించసాగింది. మెప్మాలకు పీడీలు లేకపోవడంతో స్థానిక మున్సిపల్ కమిషనర్లే ఇన్‌ఛార్జి పీడీలుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీల విధుల నిర్వహణతో సతమతమవుతున్న కమిషనర్లు మెప్మాల విషయం పూర్తిగా విస్మరించినట్లు సమాచారం. దీంతో సరైన పర్యవేక్షణ లేక స్వయం సహాయక సంఘాల పనితీరు పట్టణ ప్రాంతాల్లో పూర్తిగా కనుమరుగైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో సమర్థవంతంగా నడుస్తున్న ఎస్‌హెచ్‌జీలు పట్టణ ప్రాంతాల్లో కనుమరుగు అవుతుండటానికి కారణం పర్యవేక్షణ లోపమని గ్రహించిన ప్రభుత్వం ఈ రెండు పథకాలను ఒకే గొడుగు కింద తెచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సెర్ప్ అధికారులు అంటున్నారు.

సెర్ప్‌లో మెప్మా విలీనం

పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న మెప్మాను, గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఐకేపీలను విలీనం చేసి ఇందిరా మహిళా శక్తి మిషన్ పేరిట ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో మెప్మాలో పనిచేస్తున్న సిబ్బంది ఐకేపీలో విలీనం కాగానే దాని పరిధిలో పని చేస్తారు.

–సురేందర్, డీఆర్‌డీవో, కామారెడ్డి జిల్లా

పెన్షన్ అందించే రోజులు పెంచాలి

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో మూడు నెలల నుంచి పెన్షన్‌దారులకు రెండు మూడు రోజులు మాత్రమే పెన్షన్ పంపిణీ చేసి తర్వాత పెన్షన్ అందించడం లేదని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి బీఆర్ఎస్ నాయకులు విన్నవించారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

మున్సిపాలిటీ పరిధిలో 4,886 మంది పెన్షన్‌దారులు ఉండగా మూడు నాలుగు రోజులు మాత్రమే ఇచ్చి అయిపోయినాయి అని చెబుతున్నారని అన్నారు. దీని కారణంగా 50 శాతం మందికి మాత్రమే పెన్షన్ అందుతుందన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు. నాయకుల మోచి గణేష్, శివసూరి, సాకలి మహేష్, గాండ్ల కృష్ణ, సాయిలు, మౌల, అనిల్, మాన్య, రాము, గోపి తదితరులున్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



భిక్కనూరులో దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నేతలు



గొల్లపల్లిలో..

సాక్షి నెట్‌వర్క్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. కురుమల కుల బాంధవుడు కొమురయ్య వీర పోరాటం మరువలేనిదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఉద్యమాలన్నింటికి దొడ్డి కొమురయ్య ఆదర్శంగా నిలుస్తాడని కొనియాడారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. ఆత్మకూర్ గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జీపీలో పలు రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పల్లెదవాఖానాను సందర్శించి వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా ఇళ్ల వద్ద చాలాకాలంగా నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. జీపీ కార్యదర్శి స్రవంతి ఉన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

బీబీపేట: వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, రోగాలు ప్రబలే అవకాశం ఉందని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా మండల కేంద్రంలో పలు కాలనీల్లో పరిసరాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, కార్యదర్శి రమేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో..



ఆత్మకూర్‌లో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న ఎంపీడీవో ప్రభాకరచారి

నస్రుల్లాబాద్: ప్రతి ఇంటి ఆవరణలో రోజుల కొద్ది నీటి నిల్వ ఉండకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. శుక్రవారం నెమ్లిలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వారం నీటిని మార్చాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, జీపీ కార్యదర్శి హన్మవ్వ, తదితరులున్నారు.

రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనది



జునోసిస్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రపంచ జునోసిస్ డే(జూలై 6)ను పురస్కరించుకుని జునోసిస్ వాల్‌పోస్టర్‌లను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిచ్చి కుక్క కాటుతో సంక్రమించే జునోసిస్ వ్యాధుల్లో రేబిస్ ఎంతో ప్రమాదకరమన్నారు. దీనికి చికిత్స లేదన్నారు. ముందస్తుగా కుక్కలకు, మనుషులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకుంటే ఒక ఏడాది పాటు రేబిస్ వ్యాధి సంక్రమించకుండా ఉంటుందన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దోమకొండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థినులకు ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న అన్ని వసతులు కల్పించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధ్యాపకులకు సూచించారు.ఎంఈవో విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ వెంకట్రాములు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

చెత్త తొలగింపు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో ఆయా వార్డులలో శుక్రవారం పంచాయతీ అధికారులు రోడ్లపై ఉన్న చెత్తను తొలగించారు. సాక్షి దినపత్రికలో శుక్రవారం డంపింగ్ యార్డులున్నా నిరుపయోగమే...అనే శీర్షికతో వచ్చిన కథనానికి పంచాయతి కార్యదర్శి సందీప్ స్పందించారు. సిబ్బందితో కలిసి వీధులను పరిశీలించి రోడ్లపై ఉన్న చెత్త కుప్పలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు.

సాక్షి ఎఫెక్ట్..

స్తంభం మార్పు



నస్రుల్లాబాద్: దుర్కి గ్రామంలో రోడ్డు రోలర్ ఢీకొని స్తంభం విరిగి పోయిందని సాక్షి దినపత్రికలో 'విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన రోడ్డు రోలర్' అనే శీర్షికతో శుక్రవారం వచ్చిన కథనానికి సంబంధిత వ్యక్తులు స్పందించారు. శుక్రవారం ఉదయం విరిగిన స్తంభం స్థానంలో కొత్తది అమర్చారు.

ప్రైవేటు ఆస్పత్రి తనిఖీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్‌ను శుక్రవార డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని సిటి స్కాన్ యంత్రంతో పాటు సీఎం ఆర్‌ఎఫ్‌కు సంబంధించిన వివరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు నాగేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి చిత్రం



కబ్జాకు గురవుతున్న రామారెడ్డిలోని ఎర్రగుంట

నీటి కుంటల కబ్జాలను అడ్డుకోవాలి

రామారెడ్డి: మండల కేంద్రం రామారెడ్డిలోని రాజమ్మ తండాకు వెళ్లే మార్గంలో ఎర్రకుంటను కొందరు పూర్తిగా కబ్జా చేస్తున్నారు. దీనిని రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలి. ఎర్రకుంటలోని వర్షపు నీరు పశువులు, గొర్రెలు తాగడానికి ఉపయోగిస్తారు. – సురేష్ రామారెడ్డి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?



పెద్దకొడప్‌గల్ నుంచి బేగంపూర్ తండాకు వెళ్లే దారి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. మండల కేంద్రం నుంచి బేగంపూర్ తండా మీదుగా కాస్లాబాద్, వడ్లం గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. రోజూ వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్లు బురదమయం కావడంతో రాత్రి వేళల్లో ప్రయాణించడం మరింత ప్రమాదకరంగా మారింది. గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



రామారెడ్డిలో మాట్లాడుతున్న సామ్యెల్ మాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామారెడ్డి: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 7న మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జీ సామ్యెల్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం రామారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. ఆవిర్భావ దినోత్సవానికి అన్ని వర్గాల ప్రజలను జెండా ఆవిష్కరణకు ఆహ్వానించాలని శ్రేణులకు సూచించారు. రామారెడ్డి మండల అధ్యక్షుడు ఇనుగుర్తి రాజనర్సు మాదిగ, సీనియర్ నాయకులు కొత్తోల్ల యాదగిరి మాదిగ, మండల ఉపాధ్యక్షులు కస్తూరి శైలేష్ మాదిగ, బానాపురం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడకలను గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకోవాలని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రుసేగాం భూమయ్య కోరారు. శుక్రవారం ఆయన బాన్సువాడలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడారు. అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలు, ఆత్మబలిదానాలతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. కాశీరాం, సురేష్, సాయిలు, రాములు ఉన్నారు.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ శ్రేణులు



నిజాంసాగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి నెట్‌వర్క్: హైద్రాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకంలో భాగంగా నిర్వహించిన సభకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానుండటంతో శ్రేణులు భారీగా తరలివెళ్లాయి.

విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



ఎంఈవోతో సమావేశమైన బీజేపీ నేతలు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవడం లేదని, ప్రతి పాఠశాలలో విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని శుక్రవారం బీజేపీ నాయకులు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావును కోరారు. ప్రయివేట్ పాఠశాలల్లో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన 25 శాతం విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం లేదని ఆరోపించారు. విద్యాసంస్థల్లో కనీస వసతులు లేవని, క్వాలిఫైడ్ టీచర్లు లేరని, ఆడుకోవడానికి ఆటస్థలం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కోనాల గంగారెడ్డి, తుప్తి ప్రసాద్, గజ్జల మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పది మంది విద్యార్థుల ఎంపిక

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు పింకిబాయి, మానస, అక్షర, పావని, అంజలీలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తోట గాంధీ శుక్రవారం తెలిపారు. విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు అభినందించారు.

బాన్సువాడ రూరల్: బాసర ట్రిపుల్ ఐటీలో బాన్సువాడకు చెందిన పలువురు విద్యార్థులు సీట్లు సాధించారు. కొత్తాబాదిలోని మోడల్‌స్కూల్‌కు చెందిన గాయత్రిరెడ్డి, శ్రీనిత, కే.యోగేశ్వర్‌రెడ్డిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కమల్‌కిషోర్ తెలిపారు. అలాగే హన్మాజీపేట్ జెడ్పీహైస్కూల్‌కు చెందిన రచన, అపర్ణలు ఎంపికైనట్లు హెచ్ఎం మోహన్ తెలిపారు.

సంక్షిప్తం

దుస్తుల పంపిణీ

మాచారెడ్డి: ఇసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం దయానంద్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం పాఠశాలలో 50 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశం పొందారన్నారు. ప్రస్తుతం 233 మందికి దుస్తులతో పాటు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఇండియన్ యూత్ ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ క్లబ్ అధ్యక్షుడు కూచని శేఖర్, ప్రతినిధులు దేవరాజు, రాజు, రమేష్, ఎల్లం, నాగరాజు, నర్సింలు పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని పూజలు

మాచారెడ్డి: మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు పంట పూజ నిర్వహించారు. వరి నారును కేసీఆర్ అక్షరాలుగా తయారు చేసి ఆయన ఆరోగ్యం కుదుటపడాలని కోరుతూ భూమికి పంటకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి అభిమానాన్ని చాటుకున్నారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన

బాన్సువాడ రూరల్: దేశాయిపేట్ జీపీలో పనిచేస్తున్న సిబ్బందికి 3 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో శుక్రవారం ఆందోళన చేశారు. తమకు ఏప్రిల్, మే, జూన్ వేతనాలు చెల్లించే వరకు పనులకు హాజరు కాలేమంటూ విధులకు గైర్హాజరు అయ్యారు. ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా నిలిపివేసినట్లు సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి గీత గ్రామానికి వెళ్లి మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు.

కస్తూర్బా పాఠశాలలో మాక్ పోలింగ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ గీత ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వివిధ రకాల పదవులకు 10 మంది విద్యార్థులు పోటీ చేశారు. ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి పాఠశాలలో మాక్‌పోలింగ్ నిర్వహించామని ఆమె చెప్పారు.

ముగిసిన వారాహి గుప్త నవరాత్రి ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: స్థానిక శ్రీలలిత త్రిపుర సుందరి ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి గుప్త నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వారాహి అమ్మవారికి విశేష పూజలతో పాటు సామూహిక అభిషేకం, యజ్ఞం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదపండితులు జి.అంజనేయశర్మ, ఆలయ ప్రతినిధులు జి.శ్రీనివాస్, దామోదర్, కాచాపురం ప్రభావతి, నందీశ్వరశర్మ, అర్చకులు పాల్గొన్నారు.